క్లుప్తంగా

144 మందికి వైద్య సేవలు


వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి

కె.కోటపాడు: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి శైలజ తెలిపారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఆర్.వై.అగ్రహారం గ్రామంలో బుధవారం ఆమె 144 మందికి వైద్య సేవలందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకోవడం వల్ల గర్భిణులు, బాలింతల్లో బాలింతల్లో రక్తహీనత సమస్య ఉండదని తెలిపారు. హెల్త్ సూపర్‌వైజర్ సన్యాసిరావు, రమణ పాల్గొన్నారు.

కల్వర్టు నిర్మాణ పనులు ప్రారంభం

గొలుగొండ: పాత కృష్ణదేవిపేట వద్ద కల్వర్టు నిర్మాణ పనులను బుధవారం ప్రారంభించారు. రూ.22 లక్షల వ్యయంతో కల్వర్టు నిర్మిస్తున్నట్టు ఆర్అండ్‌బీ జేఈ ప్రసాద్ తెలిపారు. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా డైవర్షన్ రోడ్డు ఏర్పాటు చేసినట్టు చెప్పారు.

ఇందిరా కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణం

రావికమతం: తట్టబంద పంచాయతీ ఇందిరమ్మ కాలనీలో 200 మీటర్ల పొడవు సిమెంట్ రోడ్డును బుధవారం నిర్మించారు. సుమారు రూ.9లక్షల వ్యయంతో చేపట్టిన ఈ రోడ్డుకు సర్పంచ్ రమణ భూమిపూజ చేశారు.

నేడు గాంధీ మహాత్ముని తీర్థం

రావికమతం: కొత్తకోట గ్రామంలో ఏటా మాదిరిగానే మహాత్మాగాంధీ తీర్థాన్ని గురువారం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామానికి చెందిన ప్రగతి యూత్ సభ్యులు ఈ తీర్థాన్ని గడచిన పదహారేళ్లుగా రిపబ్లిక్‌డే నాడు జరుపుతున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో స్లో సైకిల్, స్పీడ్ సైకిల్, స్లోబైక్ పోటీలు, మండల స్థాయి రంగవల్లుల పోటీలను నిర్వహించనున్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ప్రగతి యూత్ అధ్యక్ష,కార్యదర్శులు బుధవారం తెలిపారు.

తపాల పథకాలపై అవగాహన

రావికమతం: తపాల శాఖ అమలు చేస్తున్న వివిధ పథకాలపై పోస్టల్ సిబ్బందికి ఆ శాఖ అనకాపల్లి డివిజన్ సూపరింటెండెంట్ జనపాల ప్రసాద్ బాబు బుధవారం అవగాహన కల్పించారు. రావికమతం సబ్‌పోస్టాఫీసులో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 28న దేశ వ్యాప్తంగా కోటి ఖాతాలు ప్రారంభించాలని లక్ష్యంగా తీసుకున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం సౌత్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు, రావికమతం పోస్టుమాస్టర్ కె.సతీష్ పాల్గొన్నారు.

రొంగలపాలెంలో వైద్య శిబిరం

రోలుగుంట: మండలంల లో రొంగలపాలెం కమ్యూనిటీ హాలు వద్ద బుధవారం నిర్వహించిన వైద్య శిబిరంలో బూరుగుపాలెం వైద్యురాలు బి.చరిష్మా, 104 వాహనం వైద్యురాలు ఎ.చాందిన దివ్య పలువురికి వైద్యసేవలందించారు. అనంతరం కమ్యూనిటీ హాలు వద్ద వైద్య శిబిరం నిర్వహించి మందులు అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రియల్ ఎస్టేట్ భూముల్లో సర్వేకు ఏర్పాట్లు

రావికమతం: తట్టబంద,బాదనపాడు గ్రామాల్లో రియల్ ఎస్టేట్ భూముల్లో సమగ్ర సర్వేకి ఏర్పాట్లు చేస్తున్నట్టు తహసీల్దార్ మహేశ్వరరావు బుధవారం తెలిపారు. తట్టబందలో సర్వే నంబర్లు 45/1,45/2లలో రియల్ ఎస్టేట్ సంస్థ భూములు కొనుగోలు చేసిందని, అలాగే బాదనపాడులో సర్వే నంబరు 40లో భూములు కొనుగోలు చేసి, అక్కడి సీలింగ్ భూములతో పాటు,కొండ గెడ్డలు,ప్రభుత్వ భూములు,శ్మశానవాటికను ఆక్రమించుకుందని ఆయా ప్రాంతాల్లో గ్రామస్తులు,రైతులు స్పందనలో ఫిర్యాదు చేశారు. రైతుల భూములను సైతం ఆక్రమించుకున్నారంటూ ఆందోళనలు చేస్తున్న నేపథ్యంలో ఆయా భూములను సమగ్ర సర్వే చేస్తామన్నారు. పాత రికార్డులు ఆధారంగా జిల్లా సర్వేయర్‌తో కొలతలు వేసి ప్రభుత్వ భూములను రక్షిస్తామని తహసీల్దార్ చెప్పారు.

ఓటు వజ్రాయుధం

ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం వంటిదని, ఆ హక్కును సద్వినియోగం చేసుకుని దేశ పురోభివృద్ధిలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని పలువురు వక్తలు సూచించారు. పలు మండలాల్లో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీలు, మానవహారాలు నిర్వహించారు.పలువురు మాట్లాడుతూ ఓటు హక్కు విలువ గురించి వివరించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు.

- ఘనంగా ఓటర్ల దినోత్సవం
- ర్యాలీలు, మానవహారాలు నిర్వహించిన విద్యార్థులు, అధికారులు


సమావేశంలో మాట్లాడుతున్నఎలక్షన్ రిటర్నింగ్ అధికారి అనిత

మాడుగుల: ఓటరు నమోదు నిరంతర ప్రక్రియ అని, 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరు ఓటరుగా నమోదు కావాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, డిప్యూటీ కలెక్టర్ ఎస్.డి. అనిత అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా స్థానిక ఎంపీడీవో సమావేశ మందిరంలో కళాశాల విద్యార్థులు, అధికారులతో ఎంపీపీ వేమవరపు రామధర్మజ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధమని చెప్పారు. అంతకు ముందు పాత బస్టాండ్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. తహసీల్దార్ రత్నం మాట్లాడుతూ నియోజకవర్గంలో 1,91,303 మంది ఓటర్లున్నారని చెప్పారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా సీనియర్ ఓటర్లను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ తాళ్ళపురెడ్డి వెంకటరాజారామ్, జెడ్పీటీసీ కిముడు రమణమ్మ, ఎంపీడీవో మీణాకుమారి, ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్ పూర్ణయ్య, సర్పంచ్ ఎడ్ల కళావతి, డీటీ సత్యనారాయణతో తదితరులు పాల్గొన్నారు.


కె.కోటపాడులో సీనియర్ ఓటర్లను సన్మానిస్తున్న రమేష్

కె.కోటపాడులో..

కె.కోటపాడు: ఓటర్ల దినోత్సవాన్ని మండల కేంద్రంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ర్యాలీ నిర్వహించి, ప్రతిజ్ఞ చేశారు. గ్రామానికి చెందిన సీనియర్ ఓటర్లను దుశ్శాలువా, జ్ఞాపికలతో సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రమేష్ మాట్లాడుతూ ఓటుహక్కుతో మంచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశం ప్రజల చేతుల్లో ఉందన్నారు. ఎంఈవో టి.మధుమూర్తి, ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్ త్రిమూర్తులు, సీనియర్ అసిస్టెంట్ కె.శ్రీనివాసరావు, ఆర్ఐలు జానకి, తరంగిణి, మండల సర్వేయర్ రామచంద్ర మూర్తి, వీఆర్వోలు పాల్గొన్నారు.

దేవరాపల్లిలో..

దేవరాపల్లి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని స్థానిక ప్రిన్సిపాల్ వి.ఎస్.వర్మ ఆధ్వర్యంలో ఘనంగా బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ చేయించారు. ఓటు హక్కు ప్రాముఖ్యతపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులను అందజేశారు. కాశీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏకపాత్రాభినయం, వ్యాసరచన, చిత్రలేఖన, గేయాలు, సామూహిక నృత్యాల పోటీలు నిర్వహించి విజేతలకు కొట్టాన రాంబాబు మాష్టారు ఆర్థిక సాయంతో బహుమతులను హెచ్ఎం నాగమణి, సీఆర్పీ ఆదిరెడ్డి ఈశ్వర రావు తదితర్లు చేతులు మీదుగా అందజేశారు.


నాతవరంలో సీనియర్ ఓటరును సత్కరిస్తున్న అధికారులు

నాతవరంలో..

నాతవరం: జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా బుధవారం మండల కేంద్రంలో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ పి.కనకారావు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటును విలువను ప్రతీ ఒక్కరూ గ్రహించాలన్నారు. అనంతరం ఓటరు గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. సీనియర్ ఓటర్లను సత్కరించారు. ఈకార్యక్రమంలోఎంపీడీవో లోకులయాదగిరీశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైల పోతురాజు, ఎంపీటీసీ సభ్యులు కరక రేణుక, మాజీ ఎంపీపీ పారుపల్లి కొండబాబు, డిప్యూటీ తహసీల్దార్ చైన్లు, ఆర్ఐలు నారాయణరావు మధు,సీనియర్ అసిస్టెంటు డి.కృష్ణ కార్యదర్శి చినబాబు, వీఆర్వోల సంఘం మండలశాఖ అధ్యక్షుడు భూపతిగణేష్,నాతవరం వీఆర్వో బొత్సా శ్రీను నూకాలమ్మ తల్లి ఆలయ కమిటీ చైర్మన్ అంకంరెడ్డి వెంకటరమణ పాల్గొన్నారు.

మాకవరపాలెంలో

మాకవరపాలెం: ప్రతీ ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుందరరావు అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం కళాశాల నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు విద్యార్థులతో ర్యాలీ, అనంతరం మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


బుచ్చెయ్యపేటలో మానవహారంగా ఏర్పడి ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు, విద్యార్థులు

గొలుగొండలో..

గొలుగొండ: జాతీయ ఓటర్ల దినోత్సవవాన్ని మండలంలో అన్ని పోలింగ్ బూత్‌ల వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఆనందరావు మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఏఎల్ పురంలో సీనియర్ ఓటర్లను సన్మానించారు.

రావికమతంలో..

రావికమతం: ప్రతీ ఒక్కరికీ ఓటు విలువ తెలియజెప్పేందుకు ఓటరు దినోత్సవాన్ని ఒక పండగలా నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ మహేశ్వరరావు తెలిపారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా బుధవారం రావికమతంలో ప్రభుత్వ ఉద్యోగులు,విద్యార్థులు తదితరులు మానవహారం నిర్వహించి, ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా మహేశ్వరరావు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం వంటిదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేటలో...

బుచ్చెయ్యపేట : రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును సద్వినియోగం చేసికోవాలని తహసీల్దార్ అంబేడ్కర్ తెలిపారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో అధికారులు ర్యాలీ నిర్వహించి, మానవహారంగా ఏర్పడి ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ మాట్లాడారు. అనంతరం సీనియర్ ఓటర్లను సన్మానించారు. ఆర్ఐ శ్రీనివాసరావు, వీఆర్వోలు జె.సుధాకర్,బాలాజీ తదితర్లు పాల్గొన్నారు.


రావికమతంలో మానవహారంగా ఏర్పడిన తహసీల్దార్ మహేశ్వరరావు తదితరులు

రోలుగుంటలో..

రోలుగుంట: జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని రోలుగుంటలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, పలు శాఖల అధికారులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ వెంకటేశ్వరరావు ప్రతిజ్ఞ చేయించారు. హెచ్ఎం అప్పారావు. డిప్యూటీ తహసీల్దార్ హెచ్.త్రివేణి, ఆర్ఐ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నంలో ...

నర్సీపట్నం: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధంలాంటిదని ఆర్డీవో హెచ్.వి.జయరాం అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలన్నారు. అనంతరం సీనియర్ ఓటర్లను ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మానవహారంగా ఏర్పడ్డారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వి.వి.రమణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


సీనియర్ ఓటర్‌ను సన్మానిస్తున్న అధికారులు


మాకవరపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు


కాశీపురం హైస్కూల్‌లో బహుమతులు పొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు



రోలుగుంటలో విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహిస్తున్న తహసీల్దార్ వెంకటేశ్వరరావు


సీనియర్ ఓటర్లను సన్మానించిన ఆర్డీవో జయరాం

పట్టాల మంజూరు ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదే

- ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: దశాబ్దాల తరబడి పోడు భూమిని సాగు చేసుకుంటున్న గిరిజనులకు ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు అందజేసిన ఘనత తమ ప్రభుత్వానిదేనని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు తెలిపారు. గరిశింగి, వాలాబు పంచాయతీ పరిధిలో పోడు సాగు చేసుకుంటున్న 410 గిరిజనులకు ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు అందజేశామని, అర్హులు ఇంకా మిగిలి ఉంటే పట్టాలు మంజూరుకు కృషి చేస్తామని తెలిపారు. గరిశింగి సచివాలయం పరిధిలోని వాలాబు పంచాయతీలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. వాలాబు, మధ్యవాలాబు, పాత వాలాబు, బుచ్చెంపాలెం, ఇప్పగరువు, పూలగరువు, రామన్నపాలెం, కోడాపల్లి, కొత్తూరు, తుమ్మలపాలెం, కె.టి.పాలెం, బొర్రచింత, బొడ్డచింత, నగరంపాలెం, బయటగరువు గ్రామాల్లో ప్రతీ ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించారు. గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడుకు ఆయా గ్రామాల ప్రజలు గిరిజన సంప్రదాయ ప్రకారం స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ వాలాబు పంచాయతీ శివారు గ్రామాల్లో ప్రతీ ఇంటికి కుళాయిల ఏర్పాటు నిమిత్తం రూ.1.49 కోట్లు మంజూరు చేసినట్టు చెప్పారు. ఇప్పగరువు, పూలగరువు, కోడాపల్లి, రామన్నపాలెం గ్రామాల్లో నూతన అంగన్‌వాడీల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఐసీడీఎస్ సీడీపీవో మంగ తాయారును ఆదేశించారు. వాలాబు, పాత వాలాబు గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి చిన్నారులతో ముచ్చటించారు.


పాత వాలాబులో గిరిజనులకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలునాయుడు

నాడు–నేడు పనులు ప్రారంభం

వాలాబు మండల పరిషత్ పాఠశాలలో రూ.18.31 లక్షలతో నాడు–నేడులో చేపట్టిన పనులను ముత్యాలనాయుడు ప్రారంభించారు. ఈకార్యక్రమంలో జెడ్పీటీసీ కర్రి సత్యం, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు, స్థానిక వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు పోడెల నానిబాబు, గ్రామ సచివాలయ కన్వీనర్ పోడెల అన్నపూర్ణ, సర్పంచ్ పోడెల వెంకటలక్ష్మి, ఎంపీటీసీ కోలా గోవి, సర్పంచ్‌లు గూడెపు రాము, చింతల సత్య వెంకటరమణ, టోకురు రామకృష్ణ, బండారు దేముడునాయుడు, బాణం రాంబాబు, ఎంపీడీవో సీహెచ్. సుబ్బలక్ష్మి, తహసీల్దార్ ఎం.లక్ష్మి,ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ అల్లు సూర్యానారాయణ, ఎంఈవో సీహెచ్. రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక, ధార్మిక కార్యక్రమాలతో ఐక్యత

- డిప్యూటీ సీఎం బూడి ముత్యాలునాయుడు

మాడుగులరూరల్: ఆధ్మాతిక, ధార్మిక కార్యక్రమాలతో గ్రామాల్లోని ప్రజల మధ్య ఐక్యత పెరుగుతుందని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలునాయుడు తెలిపారు. కె.జె.పురం పాలగెడ్డ వద్ద నూతనంగా నిర్మించిన మరిడిమాంబ ఆలయాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ పూజా కార్యక్రమాల్లో ఆయన పాల్గొని, మాట్లాడారు. ఆలయ ధర్మకర్త, విజయనగరం డీఎస్పీ వేగి వెంకటప్పారావు, ఆలయ కమిటీ అధ్యక్షులు వేగి గాంధీ, వైద్యులు వేగి సూర్యనారాయణ తదితరులు ఈ సందర్భంగా ముత్యాలునాయుడును దుశ్శాలువాతో సన్మానించారు. అనంతరం కేజే పురం కాళ్ల వారి కల్లాల వద్ద నూతనంగా నిర్మించిన మహాలక్ష్మితల్లి, ఎరుకమ్మతల్లి అమ్మవార్ల ఆలయాల్లో ఆయన పూజలు నిర్వహించారు. ఈ ఆలయాలను గురువారం ప్రారంభించనున్నారు.


మరిడిమాంబ ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలునాయుడు

భూ సర్వేకు సహకరించాలి

నాతవరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న భూ రీసర్వేను సకాలంలో పూర్తి చేసేందుకు రైతులు సహకరించాలని తహసీల్దార్ పి.కనకరావు కోరారు. మండలంలో రాజుపేట అగ్రహారం పంచాయతీలో బుధవారం జగనన్న భూ రీసర్వే పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే మండలంలో పలు గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసినట్టు చెప్పారు. ఈకార్యక్రమంలో సర్పంచ్‌లు గుడపర్తి సీతయ్యమ్మ, మిరపల వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యులు తమరాన సత్యనారాయణ,పి.కె.గూడెం పీఏసీఎస్ డైరెక్టర్ గుడపర్తి అచ్చియ్యనాయుడు, పంచాయతీ కార్యదర్శి శ్రీను పాల్గొన్నారు.


రాజుపేట అగ్రహారంలో రీసర్వేను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల పోటీ విజేత ఎం.కొత్తపల్లి


మామిడిపల్లిలో బహుమతులు అందజేస్తున్న జెడ్పీటీసీ కర్రి సత్యం, సర్పంచ్ సూరినాయుడు


పాచివానిపాలెంలో విజేతకు నగదు బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు


వరహాపురంలో ఎడ్లబళ్ల పరుగు పోటీని ప్రారంభిస్తున్న కమిటీ సభ్యులు

దేవరాపల్లి: మామిడిపల్లిలో మరిడిమాంబ తీర్థ మహోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం నిర్వహించిన జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల పోటీ విజేతగా ఎం.కొత్తపల్లి నంబారు నాయుడు ఎడ్లు ప్రథమ స్థానంలో నిలిచాయి. ద్వితీయ స్థానంలో చుక్కపల్లి మజ్జి రాజేష్, తృతీయ స్థానంలో ఎం.కోటపాడు పాశిల నాగరాజు, నాల్గువ స్థానంలో లక్కవరం సిద్ధివినాయక, ఐదవ స్థానంలో నరసయ్యపేట ముమ్మిన రామకృష్ణ, ఆరవ స్థానంలో మామిడిపల్లి బంగారు గోవింద ఎడ్లు నిలిచాయి. స్థానిక జెడ్పీటీసీ కర్రి సత్యం, సర్పంచ్ కర్రి సూరినాయుడు, ఎంపీటీసీ పంచాడ సింహాచలంనాయుడు, తిమిరాం సర్పంచ్ రెడ్డి సూర్యనారాయణ తదితరులు విజేతలకు నగదు బహుమతులను అందజేశారు. మండల స్థాయి కబడ్డీ పోటీల్లో ప్రథమ స్థానంలో వేచలం, ద్వితీయ స్థానంలో ములకలాపల్లి జట్లు నిలిచాయి.అంతకు ముందు మరిడిమాంబ అమ్మవారిని జెడ్పీటీసీ కర్రి సత్యం, సర్పంచ్ కర్రి సూరినాయుడు తదితరులు దర్శించుకున్నారు.

కె.కోటపాడు మండలంలో..

కె.కోటపాడు: పాచిలవానిపాలెంలో మరిడిమాంబ అమ్మవారి తీర్థమహోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పందాలు జరిపారు. ఈ పందెంలో మొదటి స్థానంలో నిలిచిన ఎడ్ల యజమానికి డేన్ ఫౌండేషన్ చైర్మన్ దొగ్గ అచ్చింనాయుడు బహుమతి అందించారు. వైస్ఎంపీపీ రొంగలిసూర్యనారాయణ,ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

చీడికాడ మండలంలో..

చీడికాడ: వరాహపురంలో సీతారాముల తీర్థ మహోత్సవం సందర్భంగా బుధవారం నిర్వహించిన జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల పరుగు పోటీల్లో మండలంలోని చుక్కపల్లికి చెందిన మజ్జి రాజేష్ బండి విజేత నిలవగా, తరువాత స్థానాల్లో లెక్కల సత్తిబాబు(చోడవరం), అర్జునగిరి పరువాడ నాయుడుకు చెందిన మరిడిమాంబ బండి,కొయిలాడ మోహన్(కె.జే.పురం),గండి ఆనంద్‌కుమార్ (కె.ఎల్.బి.పట్నం)బళ్లు నిలిచాయి. విజేతలకు కమిటీ సభ్యులు నగదు బహుమతులు అందజేశారు.

ఘనంగా రాములోరి తీర్థం

మాడుగుల: గాదిరాయి గ్రామంలో బుధవారం రాముల వారి తీర్థాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళల కోలాటాలు, తీన్‌మార్ వాయిద్యాలు ఆకట్టుకున్నాయి.

50 మందికి నేత్ర పరీక్షలు

రోలుగుంట: రొంగలపాలెం రామాలయం వద్ద బీజేపీ రాష్ట్ర కార్యవర్గం ప్రతినిధి తమరాన వెంకట రమణ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 50 మందికి వైద్యులు యు.ఎస్.ఎన్.మూర్తి, ఎస్.కృష్ణారావు వైద్య పరీక్షలు జరిపారు. 20 మందికి శస్త్ర చికిత్స అవసరమని గుర్తించారు.

త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి

కె.కోటపాడు : జగనన్న లేఅవుట్లలో నిర్మిస్తున్న ఇళ్ల పనులను ఉగాది కల్లా పూర్తి చేసి, గృహప్రవేశాలను జరపాలని హౌసింగ్ ఏఈ బి.రవిబాబు తెలిపారు. మండలంలో గొండుపాలెం, గుల్లేపల్లి, కింతాడ గ్రామాల్లో లేఅవుట్‌లలో ఇళ్ల నిర్మాణాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో ఆయన మాట్లాడుతూ త్వరితగతిన పనులు పూర్తి చేయాలన్నారు. గొండుపాలెం సర్పంచ్ బండారు కనకమల్లీశ్వరి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రామారావు పాల్గొన్నారు.

నాతవరం: జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని, లేకపోతే, కలెక్టరు ఆదేశాల మేరకు రద్దు చేస్తామని ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు తెలిపారు. నాతవరం, డి.యర్రవరం, మర్రిపాలెం గ్రామాల్లో జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలను ఆయన బుధవారం పరిశీలించారు. నిబంధనలు ప్రకారం నిర్మాణాలు పూర్తి చేసే లబ్ధిదారులకు సకాలంలో ప్రభుత్వం బిల్లులు చెల్లిస్తుందన్నారు.